ఈనాడు
మహబూబ్‌నగర్
మంగళవారం అక్టోబరు 1, 2024

ఊపిరి బిగపట్టుకోవాల్సిందే..!

గురుకులాల్లో సరిపడా స్నానపు గదులు, మరుగుదొడ్లు లేక అవస్థలు



నారాయణపేట జిల్లా ధన్వాడ మండలం కొండాపూర్‌లో తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర విద్యాలయంలో 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్నారు. ఇక్కడ మొత్తం 650 మంది విద్యార్థులుండగా 24 స్నానపు గదులు, మరుగుదొడ్లు ఉన్నాయి. నిబంధన ప్రకారం విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా 57 చొప్పున స్నానపు గదులు, మరుగుదొడ్లు ఉండాలి. దీంతో విద్యార్థులు ఉదయం సమయంలో ఆరుబయట కాలకృత్యాలు తీర్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. కొందరు విద్యార్థులు బయటే స్నానం చేయాల్సి వస్తోంది.



నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లిలోని జ్యోతిరావు పులే బాలుర గురుకుల విద్యాలయంలో 5 నుంచి పదో తరగతి వరకు 480 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ 15 స్నానపు గదులు, 10 మరుగుదొడ్లు ఉన్నాయి. నిబంధనల ప్రకారం 56 చొప్పున స్నానపు గదులు, మరుగుదొడ్లు ఉండాలి. దీంతో విద్యార్థులు అవస్థలు వర్ణనాతీతం. ఇక్కడ ఓ షెడ్డులో గురుకుల విద్యాలయాన్ని ఏర్పాటు చేయడంతో స్నానానికి, కాలకృత్యాలకు విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

ఈనాడు, మహబూబ్‌నగర్: ఉమ్మడి జిల్లాలోని గురుకుల పాఠశాలల్లో సరిపడా మరుగుదొడ్లు, స్నానపు గదులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాలమూరులో మొత్తం 32 ఎస్సీ, 25 బీసీ, 20 మైనార్టీ, 19 గిరిజన గురుకుల విద్యాలయాలున్నాయి. ఈ గురుకులాల్లో సుమారు 52 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఉమ్మడి జిల్లాలో పలు గురుకులాల్లో సరిపడా స్నానపు గదులు, మరుగుదొడ్లు లేవు. నిబంధనల ప్రకారం ప్రతి 25 మందికి స్నానపు గదులు, 4 మరుగుదొడ్లు ఉండాలి. ఈ లెక్కన ఏ గురుకులాల్లోనూ ఇవిలేవు. ఉమ్మడి జిల్లాలో అన్ని గురుకులాల్లో కలిపి సుమారు 6,200 చొప్పున స్నానపు గదులు, మరుగుదొడ్లు ఉండాలి. ఇందులో సగం కూడా లేనట్లు అధికారుల రికార్డులు తెలుపుతున్నాయి. దీంతో విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

సౌకర్యాలు కల్పించాలని...: ఇటీవల ఓ సామాజిక కార్యకర్త రాష్ట్రంలోని పలు గురుకులాల్లో సౌకర్యాలపై సర్వే నిర్వహించారు. దీని నివేదికను హైకోర్టుకు సమర్పించగా ప్రతి 10 మంది విద్యార్థులకు ఒక స్నానపు గది, ఏడుగురికి ఒక మరుగుదొడ్డి సౌకర్యం కల్పించి నివేదిక ఇవ్వాలని గురుకులాలను కోరింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం నాలుగు గురుకులాల్లో సర్వే నిర్వహించగా అందులో ఏ గురుకలాల్లోనూ నిబంధన ప్రకారం సౌకర్యాలు లేవు. కాలకృత్యాలు తీర్చుకొనేందుకు ఆరుబయటకు వెళ్లే క్రమంలో కొన్ని చోట్ల పాములు, ఇతర క్రిమికీటకాలతో ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు.



వనపర్తి గిరిజన సంక్షేమ గురుకుల బాలికల విద్యాలయంలో మొత్తం 699 మంది చదువుతున్నారు. వీరికి 50 స్నానపు గదులు, 78 మరుగుదొడ్లు ఉన్నాయి. ఈ విద్యాలయంలో 83 చొప్పన స్నానపు గదులు, మరుగుదొడ్లు ఉండాలి. సరిపడా లేకపోవడంతో కాలకృత్యాలు తీర్చుకోడానికి విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ముందుకు వస్తే ఎంతో మేలు..: గురుకులాల్లో మరుగుదొడ్లు, స్నానపు గదులు ఏర్పాటు చేయాలంటే ప్రత్యేక నిధులు కావాలి. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ ఎస్సీ గురుకుల బాలికల విద్యాలయంలో మరుగుదొడ్ల సమస్య రావడంతో స్థానికంగా ఉన్న సంస్థ తరపున వాటికి మరమ్మతులు చేపట్టారు. కొత్తగా ఏర్పాటు చేయడానికి కూడా ముందుకొచ్చారు. అవసరమైన చోట గురుకులాల్లో స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి మౌలిక సదుపాయాలు కల్పిస్తే విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

డీసీసీబీలో విలీనం చేయండి

హన్వాడ, న్యూస్‌టుడే: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ)లో ఎస్బీఐకి అనుబంధంగా కొనసాగుతున్న హన్వాడ ప్రాథమిక రైతు సేవా సహకార సంఘాన్ని విలీనం చేయాలని పాలక వర్గం తీర్మానించింది. సోమవారం ప్రాథమిక సహకార సంఘం సర్వసభ్య సమావేశంలో డైరెక్టర్లు, పలువురు రైతులు ఇందుకు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. సహకార సంఘం అధ్యక్షులు వెంకటయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో సంఘం డైరెక్టర్లు, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు. వివిధ అంశాలను చర్చించారు. అంతకు ముందు 2024-25 సంవత్సరానికి చెందిన బడ్జెట్ అంచనాకు ఆమోదం తెలిపారు.

నిరీక్షణకు తెర

డీఎస్సీ ఫలితాలు విడుదల ● నేటి నుంచి ధ్రువపత్రాల పరిశీలన



విద్యాశాఖ సంచాలకుల ఆదేశాలను నమోదు చేసుకుంటున్న డీఈవో రవీందర్, అధికారులు

పాలమూరు, గద్వాల అర్బన్, అచ్చంపేట, న్యూస్‌టుడే : ఉపాధ్యాయుల ఎంపిక రాత పరీక్ష (డీఎస్సీ) ఫలితాలను రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మెరుగైన మార్కులు, ర్యాంకులు సాధించిన అభ్యర్థుల ఒరిజినల్ విద్యార్హత ధ్రువపత్రాలను నేటి నుంచి 5వ తేదీ వరకు పరిశీలించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ సంచాలకులు ఉత్తర్వులు జారీ చేశారు. 2024 డీఎస్సీలో ఉమ్మడి జిల్లాలో 1,131 పోస్టులను ప్రభుత్వం ప్రకటించింది. రెండు నెలల క్రితం 20 రోజుల పాటు రాతపరీక్షలు నిర్వహించారు. టెట్‌లో 20, డీఎస్సీ రాత పరీక్షలో 80 చొప్పున మొత్తం 100 మార్కులు ఉంటాయి. ఇందులో ఎక్కువ మార్కులు పొందిన వారికి మాత్రమే పోస్టులు రానున్నాయి. ఎస్జీటీ పోస్టులు కొంతమేరకు ఉన్నా.. స్కూల్ అసిస్టెంట్ పోస్టులు కొన్ని సబ్జెక్టుల్లో కేవలం ఒకటి, రెండు మాత్రమే ఉన్నాయి. ఒక్కో ఉపాధ్యాయ పోస్టుకు ముగ్గురు అభ్యర్థులను ధ్రువపత్రాల పరిశీలనకు ఎంపిక చేశారు. ప్రస్తుతం ఉన్న ఖాళీలను రోస్టరు పాయింట్లు, రిజర్వేషన్ల ఆధారంగా భర్తీ చేయనున్నారు. ఎంపికైన అభ్యర్థుల చరవాణి నంబరుకు ఎస్ఎంఎస్ లేదా మెయిల్ ఐడీకి మెయిల్ ద్వారా సమాచారం అందించనున్నారు. ఎంపికైన అభ్యర్థుల్లో ధ్రువపత్రాల పరిశీలనకు ఏ తేదీన హాజరు కావాలో సమాచారం ఇవ్వనున్నారు.

డీఈవోల అధికారిక వెబ్‌సైట్లలో కూడా 1:3 నిష్పత్తిలో ఎంపికైన అభ్యర్థుల జాబితాను అందుబాటులో ఉంచుతున్నారు. అక్టోబరు 2 నుంచి పాఠశాలలకు దసరా సెలవులు ఇస్తున్నారు. పాఠశాలలు సెలవుల తర్వాత 15న ప్రారంభం కానున్నాయి. సెలవుల్లోనే ధ్రువపత్రాలను పరిశీలించి అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేసి ఉపాధ్యాయులుగా నియామక పత్రాలు అందజేయనున్నారు. సెలవుల తర్వాత పాఠశాలల్లో కొత్త ఉపాధ్యాయులు పాఠాలు బోధించనున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న సుమారు 2వేల మంది ఎస్జీటీలకు ఎస్ఏలుగా పదోన్నతి కల్పించడంతో చాలా చోట ఉపాధ్యాయుల కొరత ఏర్పడింది. విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. డీఎస్సీ ద్వారా ఖాళీలను భర్తీ చేయనుండటంతో ఉపాధ్యాయుల కొరత చాలా వరకు తీరనుంది. విద్యావ్యవస్థ గాడినపడనుంది.

జిల్లాల వారీగా ఇలా పోటీ

మహబూబ్‌నగర్ జిల్లాలో ఎస్జీటీ విభాగంలో 105 పోస్టులు స్థానిక సంస్థల పాఠశాలల్లో ఉండగా 2,979 మంది పరీక్ష రాశారు. స్కూల్ అసిస్టెంట్ జీవశాస్త్రానికి 7 పోస్టులు ఉంటే 763 మంది పరీక్ష రాశారు. ఎస్జీటీలో తుప్పలి శివసాయి అనే అభ్యర్థి 84 మార్కులు తెచ్చుకొని జిల్లాలోనే ప్రథమ ర్యాంకు సాధించాడు. నాగర్‌కర్నూల్ జిల్లాలో 111 ఎస్జీటీ పోస్టులకు 3,418 (ఒక్కోదానికి 31) మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. సౌమ్య ఎస్జీటీ ఫలితాల్లో 84.90 మార్కులతో జిల్లాలో మొదటి ర్యాంకు సాధించారు. నారాయణపేట జిల్లాలో తెలుగు విభాగంలో 127 ఎస్జీటీ పోస్టులకు 2,608 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. ప్రియాంక 87.37 మార్కులతో జిల్లాలో మొదటి ర్యాంకును సాధించారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎస్జీటీ విభాగంలో అత్యధిక మార్కులు ఇవే కావటం విశేషం. జోగులాంబ గద్వాల జిల్లాలో తెలుగు మాధ్యమంలో 60 పోస్టులకు 2,694 మంది పరీక్ష రాశారు.

ఉమ్మడి జిల్లాలో పోస్టులు, అభ్యర్థుల పరిస్థితి..

జిల్లా	మొత్తం అభ్యర్థులు	మొత్తం పోస్టులు	1:3 అభ్యర్థులు
నాగర్‌కర్నూల్	10,072	285	855
మహబూబ్‌నగర్	7,521	243	729
నారాయణపేట	5,972	279	837
గద్వాల	6,474	172	516
వనపర్తి	2,137	152	456

అన్ని ధ్రువపత్రాలతో రావాలి

నేటి నుంచి ఐదు రోజుల పాటు అభ్యర్థుల ధ్రువపత్రాలు పరిశీలిస్తాం. విభాగాల వారీగా సిబ్బందికి విధులు కేటాయిస్తాం. పకడ్బందీ ఏర్పాట్లు చేస్తాం. పరిశీలనకు వచ్చే అభ్యర్థులు వెంట అన్ని ఒరిజినల్ అర్హత ధ్రువపత్రాలను తీసుకొని రావాలి.

- రవీందర్, మహబూబ్‌నగర డీఈవో

రైతేరాజు 8 లో..

దసరాకు 649 ప్రత్యేక బస్సులు

నేటి నుంచి అందుబాటులోకి సర్వీసులు

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే : దసరా పండగ నేపథ్యంలో ఆర్టీసీ మహబూబ్‌నగర్ రీజియన్ పరిధిలోని డిపోల నుంచి ఈ నెల 1 నుంచి 11వ తేదీ వరకు 649 ప్రత్యేక బస్సులు నడిపేందుకు నిర్ణయించారు. నగరాల్లో స్థిరపడిన వారు దసరా పండగ కుటుంబ సభ్యులతో కలిసి చేసుకునేందుకు పల్లెలకు తరలివస్తారు. ఈ నేపథ్యంలో రద్దీకి అనుగుణంగా హైదరాబాద్‌కు బస్సులు నడపనున్నారు. అచ్చంపేట-105, వనపర్తి-95, గద్వాల-89, మహబూబ్‌నగర్-69, కల్వకుర్తి-67, షాద్‌నగర్-59, కొల్లాపూర్-58, నారాయణపేట-54, నాగర్‌కర్నూల్-53 బస్సులను నడపనున్నట్లు ఆర్ఎం శ్రీదేవి తెలిపారు. ప్రత్యేక బస్సుల్లో 25 శాతం అదనపు ఛార్జీలు వసూలు చేయనున్నట్లు చెప్పారు. మహబూబ్‌నగర్, జడ్చర్ల, గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్, నారాయణపేట, కల్వకుర్తి, అచ్చంపేట, కొల్లాపూర్, షాద్‌నగర్, కొత్తకోట, పెబ్బేరు, మక్తల్, కోస్గి, అయిజ, ఆమన్‌గల్, తెలకపల్లి, డిండి, బిజినేపల్లి, మద్దూర్, మరికల్, గణపూర్ బస్టాండ్ల నుంచి బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు.



తగ్గిన దిగుబడి.. పెరిగిన దిగుమతి

భారంగా మారిన ఉల్లి ధరలు



దేవరకద్రలో ఉల్లిని విక్రయిస్తున్న రైతులు

పెరిగిన ధరలు (రూ॥ల్లో) ఇలా..

	క్వింటాలు	కిలో
జులై	2,000	20
ఆగస్టు	3,500	40
సెప్టెంబరు	5,600	60

న్యూస్‌టుడే, మహబూబ్‌నగర్ వ్యవసాయం, దేవరకద్ర గ్రామీణం : ఏ కూర వండాలన్నా ఉల్లి ఉండాల్సిందే.. ఆ ఉల్లి ధరలే పెరిగిపోవటం సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు ఇబ్బందికరంగా మారింది. గతేడాది ఉల్లి సాగు చేసిన రైతులు మార్కెట్లో సరైన ధరలు లేక తక్కువ ధరలకు అమ్ముకున్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకున్న రైతులు ఈసారి పెద్దగా సాగు చేయలేకపోయారు. వర్షాలు ఆలస్యం కావటం కూడా ఇందుకు కారణం. ఫలితంగా ఉల్లిపంట కొరత ఏర్పడి ధర పెరిగిపోతోంది.

వర్షాలతో దెబ్బతిన్న పంట : వీపనగండ్ల, తిమ్మాజిపేట, వనపర్తి, పెబ్బేరు, ఊట్కూర్, నారాయణపేట, మక్తల్, నవాబుపేట, బాలానగర్, కల్వకుర్తి, ఊర్కొండపేట, మిడ్జిల్, బిజినేపల్లి, గండీడ్, మహమ్మదాబాద్ తదితర మండలాల్లో ఉల్లిని ఎక్కువగా సాగు చేస్తారు. ఉమ్మడి జిల్లాలో 3,600 ఎకరాల్లో సాగయ్యే ఉల్లి పంట ఈసారి 1,200 ఎకరాలకు పడిపోయింది. ఇటీవలి వర్షాలతో ఉమ్మడి జిల్లాలో సాగు చేసిన కొద్దిపాటి ఉల్లిపంట కూడా దెబ్బతింది. ఈ నేపథ్యంలో మూడు నెలలుగా ఉల్లి ధరలు పెరుగుతూ వచ్చాయి. మహబూబ్‌నగర్ జిల్లాలో వర్షాకాలంలో 52 ఎకరాలు, జోగులాంబ గద్వాల జిల్లాలో 87 ఎకరాల్లోనే ఉల్లి సాగైంది. వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో 2,800 ఎకరాల్లో ఉల్లి సాగయ్యేది. ఈసారి 971 ఎకరాల్లోనే సాగైంది. నారాయణపేట జిల్లాలో 340 ఎకరాలకు గాను 86 ఎకరాల్లో సాగైంది. వర్షాలతో పంట దెబ్బతినటంతో కర్నూలు, నందికొట్కూరు, మంత్రాలయం, అనంతపురం వంటి ప్రాంతాల నుంచి ఉమ్మడి జిల్లాకు ఉల్లి రాలేదు. ఈ పరిస్థితుల్లో వ్యాపారులు మహారాష్ట్రలోని నాసిక్, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక నుంచి ఉల్లిని దిగుమతి చేసుకోవటంతో ధర మూడింతలు పెరిగింది. క్వింటా ఉల్లి ధర జులైలో రూ.2,000 ఉండగా.. సెప్టెంబరులో రూ.5,600లకు పెరిగింది. కిలో ఉల్లి ధర జులైలో రూ.15 నుంచి రూ.20 ఉండగా.. ఇప్పుడు రూ.60కి పెరిగింది. మహబూబ్‌నగర్ జిల్లా ఉద్యాన అధికారి కె.వేణుగోపాల్‌ని 'న్యూస్‌టుడే' సంప్రదించగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సాగు తగ్గటం, వర్షాలతో పంట దెబ్బతినటమే ధరల పెరుగుదలకు కారణమన్నారు. యాసంగిలో పంట సాగు పెరిగి ధరలు తగ్గే అవకాశం ఉంటుందని తెలిపారు.



భారంగా మారింది.. : ఏ కూర వండలన్నా ఉల్లి తప్పనిసరి. పెరిగిన ఉల్లి ధరలు మాకు భారంగా మారాయి. వారానికి 3 కిలోల వరకు ఉల్లి వినియోగిస్తాం. పెరిగిన ఉల్లి ధరలతో కొనుగోలు చేయలేకపోతున్నాం. ఉల్లి ధరలను నియంత్రించి సామాన్యులకు అందుబాటులో ఉంచాలి.

- సంధ్యారాణి, మహిళ, గూరకొండ



రైతుకు లాభం లేదు.. : మార్కెట్‌లో ఉల్లి కిలో రూ.60కి విక్రయిస్తున్నారు. రైతులు మార్కెట్‌కు పంట తీసుకెళ్తే క్వింటాకు రూ.2,500 నుంచి రూ.3,500 వరకే ఇస్తున్నారు. పేరుకే ఒకరిద్దరు రైతులకు రూ.5వేల చొప్పున చెల్లిస్తున్నారు. పెరిగిన ధర రైతులకు కూడా చెల్లించాలి.

- భగవంతు, రైతు, దేవరకద్ర

శ్రీవారి లడ్డూ అపవిత్రతపై విచారణకు డిమాండ్



నిరసన ర్యాలీలో పాల్గొన్న వీహెచ్‌పీ, వివిధ హిందూ సంఘాల నాయకులు, కార్యకర్తలు

మహబూబ్‌నగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే : తిరుమల శ్రీవారి లడ్డూనూ అపవిత్రం చేయటంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని వీహెచ్‌పీ, వివిధ హైందవ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. సోమవారం మహబూబ్‌నగర్ పట్టణంలో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున నిరసన ర్యాలీ, ధర్నా చేపట్టారు. తితిదే కల్యాణ మండపం నుంచి ప్రారంభమైన నిరసన ర్యాలీ న్యూటౌన్, కొత్తబస్టాండ్, బాలగంగాధర్ తిలక్ చౌరస్తా మీదుగా గడియారం చౌరస్తాకు చేరుకుంది. ఈ సందర్భంగా భక్తులు చేసిన జైశ్రీరాం, గోవిందనామ స్మరణలతో ఆ ప్రాంతం మార్మోగింది. భజన సంఘాల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు నాయిని బాగన్నగౌడ్ సంకీర్తనలు ఆలపించగా భక్తులు అనుకరించారు. గడియారం చౌరస్తాలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షకార్యదర్శులు మద్ది యాదిరెడ్డి, నలిగేశి లక్ష్మీనారాయణ, బ్రాహ్మణ సేవా సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి గొండ్యాల రాఘవేంద్రశర్మ, భాజపా జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు పి.శ్రీనివాస్‌రెడ్డి, కె.కిరణ్‌కుమార్‌రెడ్డి, అచ్చుగట్ల అంజయ్య, వీహెచ్‌పీ అర్చక పురోహిత సంఘం అధ్యక్షుడు గంగాపురం రామకృష్ణశర్మ, అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి జిల్లా అధ్యక్షుడు సీమ నరేందర్, రామకృష్ణ సేవాసమితి జిల్లా కార్యదర్శి రాజ్‌మల్లేశ్, వివిధ హైందవ మహిళా సంఘాల బాధ్యులు లావణ్య, నాగశివలక్ష్మి మాట్లాడారు. లడ్డూ తయారీలో అపచారం చేసి కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీశారని ధ్వజమెత్తారు. హైందవుల్లో ఐక్యత లేనందునే హిందూ సంస్కృతీ, సంప్రదాయాలపై దాడులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. దేవాలయాల్లో పనిచేస్తున్న అన్య మతస్థులను తొలగించాలని, దేవాదాయ శాఖను రద్దు చేసి ఆలయాలను స్వామీజీలు, ధార్మిక సంస్థలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ విజయేందిర బోయిని కలిసి వినతిపత్రం అందించారు. వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్, దుర్గావాహిని, మాతృమండలి, ఆర్యవైశ్య సంఘం, బ్రాహ్మణసేవాసమితి, లింగాయత్ సమాజం, విశ్వబ్రాహ్మణ సంఘం, గణేశ్ ఉత్సవసమితి, వివిధ దేవాలయాల కమిటీలు, భజన సంఘాల ప్రతినిధులు హన్మంతు, విఘ్నేశ్, ప్రాణేశ్, బాబుల్‌రెడ్డి, బురుజు రాజేందర్‌రెడ్డి, పి.శివుడు, జి.పవన్‌కుమార్‌శర్మ పాల్గొన్నారు.

పోలేపల్లిలో రూ.1.5 కోట్ల దుర్వినియోగం!

జడ్చర్ల, న్యూస్‌టుడే : పోలేపల్లి గ్రామ పంచాయతీలో దస్త్రాల్లో మార్పులు, చేర్పులు చేసి అభివృద్ధి పనుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మంజూరైన నిధుల్లో రూ.1.5 కోట్ల వరకు దుర్వినియోగానికి పాల్పడ్డారని అధికారుల విచారణలో తేలినట్లు సమాచారం. విశ్వసనీయ వర్గాల కథనం ప్రకారం.. జడ్చర్ల మండలం పోలేపల్లి పంచాయతీలో విధులు నిర్వహించిన కార్యదర్శి 2024 జులై 19న హన్వాడ మండలం అమ్మాపూర్‌తండా పంచాయతీకి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో రంగారెడ్డిగూడలో పనిచేస్తున్న లక్ష్మీనారాయణ జులై 20న పోలేపల్లికి బదిలీపై వచ్చారు. పంచాయతీ నిధుల వినియోగం, చేపట్టిన పనుల ఎం.బి.రికార్డులు, వోచర్లు, బిల్లుల వివరాల దస్త్రాలను గత కార్యదర్శి ప్రస్తుత కార్యదర్శికి అప్పగించలేదు. ఈ విషయంపై జడ్చర్ల ఎంపీడీవోకు పోలేపల్లి పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఆగస్టు 15న గత కార్యదర్శికి తాఖీదులు జారీ చేశారు. మూడు రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని కోరారు. గడువు ముగిసినా దస్త్రాలను సమర్పించకపోవడంతో ఆగస్టు 20న మండల పంచాయతీ అధికారి (ఎంపీవో) జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో)కి లేఖ ద్వారా ఫిర్యాదు చేశారు. గత నెల 19న కలెక్టర్‌కు కూడా లేఖ ద్వారా ఫిర్యాదు చేశారు. నెలలు గడిచినా దస్త్రాలు అప్పగించకపోవడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు డీపీవో.. డీఎల్పీవో పండరీనాథ్‌ను విచారణ అధికారిగా నియమించారు. గత నెల 18న డీఎల్పీవో పూర్వ కార్యదర్శి, పూర్వ సర్పంచిని పిలిచి పోలేపల్లి గ్రామ పంచాయతీలో విచారణ చేపట్టారు. 2019-2020 నుంచి 2024 వరకు చేపట్టిన అభివృద్ధి పనులు, ఇందుకు చేసిన ఖర్చు, మిగిలిన నిధుల వివరాలను పరిశీలించారు. రూ.7కోట్ల నిధులు ఖర్చు చేయగా రూ.1,64,13,529 దుర్వినియోగమైనట్లు గుర్తించారు. హరితహారం మొక్కల కొనుగోలు, పారిశుద్ధ్య చర్యలు, పాత ఇళ్ల కూల్చివేత, సీసీ రోడ్ల నిర్మాణం, ఎనిమల్ క్యాచింగ్, సీసీరోడ్లతో పాటు అంతర్గత కాల్వల నిర్మాణం తదితర పనుల్లో అవినీతి చోటు చేసుకున్నట్లు ఈనెల 25న జిల్లా కలెక్టర్‌కు విచారణ అధికారి నివేదికను సమర్పించినట్లు తెలిసింది. దుర్వినియోగమైన నిధులు గత పంచాయతీ కార్యదర్శి, గత సర్పంచి నుంచి రికవరీ చేయాలని, తర్వాత పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించినట్లు సమాచారం. త్వరలోనే ఇద్దరిపై చర్యలు తీసుకునే అవకాశముంది. జడ్చర్ల ఎంపీడీవో విజయ్‌కుమార్‌ను 'న్యూస్‌టుడే' సంప్రదించగా డీఎల్పీవో విచారణ నివేదికను కలెక్టర్, డీపీవోలకు సమర్పించారని తెలిపారు. డీఎల్పీవో సోమవారం ఉద్యోగ విరమణ చేయడంతో జిల్లా అధికారులు ఆయన స్థానంలో మరొకరికి బాధ్యతలు అప్పగిస్తారన్నారు నివేదికలోని వివరాలు తనకు తెలియవని, నిధులు దుర్వినియోగమైతే గత కార్యదర్శి, సర్పంచి నుంచి రికవరీ చేసే అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు.

ఎక్కడి సమస్యలకు అక్కడే పరిష్కారం : కలెక్టర్



భూత్పూర్ ప్రజావాణిలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, భూత్పూర్, న్యూస్‌టుడే : ఎక్కడి సమస్యలకు అక్కడే పరిష్కారం చూపేందుకే మండల స్థాయిలో ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ విజయేందిర అన్నారు. భూత్పూర్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిని ఆమె పరిశీలించారు. శాఖల వారీగా అధికారులంతా ప్రజావాణికి హాజరుకావాలని, సమస్యలు, ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి క్షేత్రస్థాయిలోనే పరిష్కారం చూపాలని చెప్పారు. ఫిర్యాదు చేసిన ప్రతి వ్యక్తికి రశీదు అందజేయాలని సూచించారు. ప్రజావాణికి రెవెన్యూకు సంబంధించి రెండు అభ్యర్థనలు రాగా పరిశీలనకు ఆదేశించారు. స్థానిక పీహెచ్‌సీలో పంచాయతీ కార్మికులు, ఆశ కార్యకర్తలకు నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని పరిశీలించారు. శిబిరంలో కార్మికులకు కాన్సర్, గుండె, గర్భకోశ వ్యాధుల పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్య కార్డులో నమోదు చేయాలని వైద్యులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ ప్రజల సమస్యలు తెలుసుకుని ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజావాణికి మొత్తం 54 ఫిర్యాదులు వచ్చాయి. అనంతరం కలెక్టర్ అధికారుల సమ్మిళిత సమావేశంలో మాట్లాడారు. మహిళా సంఘాల సభ్యులకు ఆదాయం వచ్చే స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటుపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పారిశుద్ధ్య చర్యలు, విద్యుత్తు దీపాలు, పంఖాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, ఎస్.మోహన్‌రావు, డీఆర్వో కేవీవీ రవికుమార్, జడ్పీ సీఈవో వెంకట్‌రెడ్డి, ఇతర అధికారులు హాజరయ్యారు. వివిధ సమస్యలపై వచ్చిన ఫిర్యాదుల వివరాలు ఇలా ఉన్నాయి.

- కోయిలకొండ మండలం సోమ్లానాయక్ తండాకు చెందిన వి.లక్ష్మి తాను మహబూబ్‌నగర్‌లోని ఓ ప్రైవేటు కంటి ఆస్పత్రిలో కాటరాక్ట్ శస్త్రచికిత్స చేయించుకున్నానని, వైద్యుడి నిర్లక్ష్యంతో కంటి చూపు కోల్పోయానని, న్యాయం చేయాలని కలెక్టర్‌కు విన్నవించారు.
- పాలకొండ శివారు బైపాస్ రోడ్డులో అధికార పార్టీ నాయకుడు రోడ్డును కబ్జా చేసి అక్రమ నిర్మాణం చేపట్టారని, విచారణ చేయించి చర్యలు తీసుకోవాలని భారాస నేత ఇమ్రాన్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.
- తాతల నాటి నుంచి తాము సేద్యం చేస్తున్న భూమిని కొందరు కబ్జా చేసి కొంత భాగం విక్రయించారని జడ్చర్ల మండలం బురెడ్డిపల్లికి చెందిన పలువురు కలెక్టర్‌కు విన్నవించారు. సర్వే చేయించి తమ భూమి తమకు అప్పగించాలని కోరారు.
- కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పేర్కొన్న విధంగా తమకు నెలకు రూ.5వేలు గౌరవ వేతనం అందించాలని రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు అన్వర్ పాషా, నాయకులు కలెక్టర్‌కు విన్నవించారు. క్వింటా బియ్యం విక్రయిస్తే ప్రస్తుతం రూ.140 ఇస్తున్నారని, రూ.300 చెల్లించాలని కోరారు.

వానాకాలం పత్తి కొనుగోలుకు ఏర్పాట్లు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: వానాకాలం పత్తి కొనుగోలుకు అవసరమైన ఏర్పాట్లు సత్వరం చేయాలని కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. సోమవారం నిర్వహించిన వానాకాలం పత్తి కొనుగోలు జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. కేంద్రం పత్తికి క్వింటాలుకు రూ.7,521 మద్దతు ధర ప్రకటించిందని పేర్కొన్నారు. తేమశాతం 12కు మించకుండా పత్తిని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పత్తి అమ్మాక సొమ్ము బ్యాంకు ఖాతాల్లో జమయ్యేలా బ్యాంకుకు ఆధార్‌తో అనుసంధానం చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో మహబూబ్‌నగర్, బాదేపల్లి మార్కెట్ యార్డుల్లో ప్రతి సీజన్‌లో పత్తిని కొనుగోలుకు ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి బాలమణి, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా బ్రాంచి మేనేజరు మహేశ్వర్‌రెడ్డి, రవాణా అధికారి రఘు తదితరులు హాజరయ్యారు.

బాదేపల్లి మార్కెట్‌లో పెరిగిన మొక్కజొన్న కొనుగోళ్లు

జడ్చర్ల : బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో మొక్కజొన్న విక్రయాలు క్రమేపి పెరుగుతున్నాయి. మార్కెట్‌కు సోమవారం మొత్తం 119 మంది రైతులు వివిధ పంట ఉత్పత్తులను తీసుకొచ్చారు. మొక్కజొన్న 3,449 క్వింటాళ్ల విక్రయాలు జరగగా ధర రూ.1,589 నుంచి రూ.2,574 వచ్చినట్టు అధికారులు ప్రకటించారు.

మహిళా ఠాణాను తనిఖీ చేసిన ఎస్పీ

మహబూబ్‌నగర్ నేరవిభాగం : జిల్లా కేంద్రంలోని మహిళా పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ డి.జానకి సోమవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని దస్త్రాలను పరిశీలించారు. రోజు వచ్చే కేసుల సంఖ్యపై ఆరా తీశారు. కుటుంబ గొడవలతో వచ్చే దంపతులకు కౌన్సెలింగ్ చేసే విధానాన్ని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రాజీ మార్గంలో దంపతుల కేసులు పరిష్కరించాలని సూచించారు. నమోదైన కేసులు, పెండింగ్‌లో ఉన్న వాటి రికార్డులను పరిశీలించారు. సీఐ శ్రీనివాస్, ఎస్సైలు శైలజ, అఫ్జల్ పాల్గొన్నారు.

ఆకుకూర.. తినవే తీరా!

- చవగ్గా అందుబాటులో పోషకాహారం
- నేడు శాకాహార దినోత్సవం

పాలు, పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, గుడ్లలో కొవ్వులేక పోవడం వలన గుండె జబ్బులు దరిచేరవు. ఆకుకూరలు, కూరగాయల్లోని యాంటీ ఆక్సిడెంట్లు క్యాన్సర్ వంటి ప్రమాదకర రోగాలు దరిచేరని వ్వవని సర్వేలు చెబుతున్నాయి. శాకాహారంలో ఆకుకూరలకు ప్రాధాన్యం ఉండటమే కాకుండా ఎలాంటి ఖర్చులేకుండా ఇంటి పరిసరాల్లోనూ పండించుకోవచ్చు.

- న్యూస్‌టుడే, బిజినేపల్లి

తొలిసారి 1977లో..

పర్యావరణాన్ని, ఆరోగ్యాన్ని కాపాడేదిశగా ప్రజల్లో అవగాహన కల్పించడానికి ఏటా అక్టోబర్ 1న ప్రపంచ శాకాహార దినోత్సవాన్ని జరుపుకొంటారు. తొలిసారి 1977లో అమెరికాలో నిర్వహించారు. శాకాహార ప్రాముఖ్యత, విలువలను ప్రపంచానికి వివరించేందుకు ఇప్పటివరకు వందలాది సదస్సులను నిర్వహించారు.

అందుబాటులో ఆరోగ్యం: భారతదేశంలో అనాదిగా శాకాహారానికి ఉన్న ప్రాధాన్యం గొప్పది. అందరికీ అందుబాటులో ఉండేలా ప్రకృతి ఇచ్చిన వరం ఆకుకూరలు. రోజూ ఏదో ఒక ఆకుకూరను ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యం కోసం రూ. వేలు ఖర్చు పెట్టాల్సిన అవసరం ఉండదు. జీవన శైలిని మార్చే సత్తా ఆకుకూరలకు ఉందని ఆయుర్వేద నిపుణులు పేర్కొంటున్నారు. ఆకుకూరల్లో తక్కువ కొవ్వు ఉండటం, అధిక ప్రొటీన్లు, ఖనిజలవణాలు అధికం. పెరడు, ఇంటి మిద్దెలపై ఖాళీ డబ్బాలు, కుండీలను వినియోగించి ఇంటికి కావాల్సిన తాజా ఆకుకూరలను పండించుకోవచ్చు.

తోటకూర : ఆకుకూరల్లో ఎక్కువమంది ఇష్టపడే తోటకూరలో యాంటీ ఆక్సిడెంట్ గుణాలతో పాటూ, అనేక పోషకాలున్నాయి. తోటకూరను ఆహారంగా తీసుకుంటే రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. క్యాన్సర్‌ని నిరోధిస్తుంది. త్వరగా జీర్ణమవడంతో పాటూ, జలుబు, జ్వరం వంటి చిన్న రోగాల బారిన పడకుండా కాపాడుతుంది. విత్తిన నాటి నుంచి 25 నుంచి 30 రోజుల్లోపు కోతకు వస్తుంది.

గోంగూర (పుంటి కూర) : గోంగూరతో చాలా లాభాలున్నాయి. తినడానికి కాస్త పుల్లగా అనిపించినా.. గోంగూర తరుచూ తినడం వలన రక్తహీనత సమస్య దరిచేరదు. గుండెకు బలం చేకూరుతుంది. గోంగూరను బాగా ఉడకబెట్టి పుండ్లపై కడితే అవి త్వరగా మానుతాయి. గోంగూర నిల్వ పచ్చడిగా వినియోగించుకోవచ్చు. విత్తిన నాటి నుంచి 15 నుంచి 20 రోజుల్లోగా గోంగూర ఆకులను ఆహారంగా తీసుకోవచ్చు.

బచ్చలి కూర : బచ్చలికూర గ్రామాల్లో విరివిగా లభిస్తుంది. ఆహారంలో తరచూ వాడటం వలన ఒంట్లో వేడి క్రమేపి తగ్గుతుంది. మూత్రంలో మంట, ఇన్‌ఫెక్షన్లపై ప్రభావం చూపుతుంది. బచ్చలి కూరను కూడా కుండీలు, ఇంటి ఆవరణలో సులభంగా పెంచుకోవచ్చు. నాటిన 30 నుంచి 35 రోజుల వ్యవధిలో కోతకు వస్తుంది.

పాల కూర : పాల కూరకు రక్తాన్ని శుద్ధి చేసే తత్వం ఉంటుంది. పాలకూరలో విటమిన్ సి, ఏ, మెగ్నీషియం, ఫోలిక్ యాసిడ్ వంటివి క్యాన్సర్ వంటి వ్యాధులను నివారించడంలో తోడ్పడతాయి. ముఖ్యంగా ఊపిరితిత్తులు, రొమ్ము క్యాన్సర్‌ను అదుపుచేయడంలో పాలకూర ప్రముఖ పాత్ర పోషిస్తుంది. ఈ ఆకుకూర వాత, పిత్త, కఫ దోషాలను నివారిస్తుంది. విత్తనం నాటిన 20 -25 రోజుల నుంచి పాలకూరను ఆహారంగా వినియోగించవచ్చు.

కంటి చూపునకు పొన్నగంటి కూర : పొన్నగంటి కూర శరీరానికి చలువ చేస్తుంది. కంటి చూపు సమస్యతో బాధ పడేవారికి పొన్నగంటి కూర చాలా మేలు చేస్తుంది. నిత్యం ఆహారంలో తీసుకోవడం వలన కంటి చూపు మెరుగుపడుతుంది. పొన్నగంటి కూర సహజసిద్ధంగా పొలం గట్లపై వర్షాకాలంలో లభిస్తుంది.

అందుబాటులో అధిక పోషకాలు.. : సహజసిద్ధంగా పంట పొలాల్లో పెరిగే జొన్నచెంచలి, గొగ్గలి, ఎల్కచెవులకూర, తగరించ, పాయలాకు, తలైలా, గుప్తరేణి, గునుగు, తుమ్మి, పొన్నగంటి, నల్లకాశ, తెల్లకాశ, బుడ్డకాశ, గోరుమాడి, సన్నపాయల, తెల్లగజ్జల, చెన్నంగి, యెన్నాద్రి, అడవి సోయ కూర, చిత్రమాళ, అంగిబింగి, అడవి పుల్లకూర, బంకటి పూర, నల్లనేల ఉసిరి, ముల్లుదొగ్గలి, పులపత్రం, గంగవాయిలి వంటి సహజంగా లభించే ఆకుకూరలను ప్రజలు ఆహారంగా తీసుకోవడం లేదు. వాణిజ్యంగా సాగు చేసిన ఆకుకూరలతో పోలిస్తే వీటిలో అధిక మొత్తంలో సూక్ష్మ పోషకాలు, ప్రొటీన్లు ఉన్నాయి. డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ, కేవీకే ఆధ్వర్యంలో ప్రకృతిలో లభించే ఆకుకూరలపై అవగాహన కల్పిస్తున్నాం.

- హేమలత, గృహ విజ్ఞానశాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం, జహీరాబాద్

ఉమ్మడి జిల్లాలో కూరగాయల సాగు విస్తీర్ణం ఇలా..

జిల్లా	కూరగాయల సాగు	ఉత్పత్తి (సుమారు టన్నుల్లో)
నారాయణపేట	2,217	26,075
మహబూబ్‌నగర్	1,986	18,795
జోగులాంబ గద్వాల	4,585	52,350
నాగర్‌కర్నూల్	1,890	20,892
వనపర్తి	1,719	19,780

పెరట్లోనే కూరగాయలు..: 30 ఏళ్లుగా పెరటి తోటల పెంపకం ద్వారానే కూరగాయలు, ఆకుకూరలు పండిస్తున్నాను. నిత్యం తీసుకునే ఆహారంలో ఏదో ఒక ఆకుకూర తీసుకోవడం వలన ఆరోగ్య సమస్యలు తలెత్తవు. ఇంటి బయట ఖాళీ స్థలం లేని వారు, మిద్దెపై కుండీల్లోనూ కూరగాయలు, ఆకుకూరలు సాగుచేసుకోవచ్చు.


- శారద, విశ్రాంత ఉపాధ్యాయిని, పాలెం



పెరటితోట సాగులో విశ్రాంత ఉపాధ్యాయురాలు శారద

పొగాకు నారు మడి.. అధిక రాబడి

మల్దకల్, న్యూస్‌టుడే : సంప్రదాయ పంటలు సాగుచేసి ఆశించిన స్థాయిలో దిగుబడి దక్కక, గిట్టుబాటు ధరలు లభించక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్న ఓ రైతు మిత్రుడి సలహాతో పొగాకు నారు సాగు చేసి లాభాల బాటలో పయనిస్తున్నారు. జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం తాటికుంటకు చెందిన పెద్ద తిమ్మోటి 30 గుంటల్లో పొగాకు నారు పెంపకం చేపట్టారు. పొడవు 40 అడుగులు, వెడల్పు మూడు అడుగుల ప్రకారం 150 బెడ్లు ఏర్పాటు చేసుకుని జులై చివరి వారంలో విత్తనాలు చల్లారు. అంతకు ముందు పొలంలో రెండు ట్రాక్టర్ల పశువుల ఎరువుతో పాటు సేంద్రియ ఎరువు వేసి కలియదున్నారు. బిందు సేద్యం పరికరాలతో నీటితడులు అందించారు.



నారుమడిలో కలుపు తీస్తున్న రైతు పెద్దతిమ్మోటి



55 నుంచి 60 రోజుల వరకు పొలంలో నాటడానికి అనుకూలంగా ఉండటంతో వివిధ ప్రాంతాలకు చెందిన రైతులు ఇక్కడికే వచ్చి నారు తీసుకెళ్తున్నారు. కూలీలు, ఎరువులు, బెడ్ల తయారీ, ఇతరత్రా అవసరాలకు రూ.1.10 లక్షల వరకు ఖర్చయినట్లు రైతు తెలిపారు. 120 బెడ్ల నారు విక్రయించగా రూ.2.50 లక్షలు వచ్చాయన్నారు. రూ.1.40 లక్షలు ఆదాయం పొందినట్లు పేర్కొన్నారు. ఇంకా 30 బెడ్ల నారు ఉందని తెలిపారు.

పొలం వద్దే కొనుగోళ్లు: పొగాకు బెడ్లలో కలుపు నివారణకు కూలీలు అవసరం. కలుపు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నా. కర్ణాటకతో పాటు గట్టు, ఐజ, గద్వాల మండలాలకు చెందిన రైతులు పొలం వద్దకే వచ్చి నారు కొనుగోలు చేస్తున్నారు. ఆరెకరాల నారు పెంచి విక్రయిస్తున్నా. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు వస్తున్నాయి.

- పెద్దతిమ్మోటి రైతు, తాటికుంట, మల్దకల్‌మండలం

ప్రశ్నలు - సమాధానాలు

? వరి ఆకుముడత నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి? **- కృష్ణయ్య, దంతనూర్**

✓ గంధకం 3 గ్రాములు లేదా పొపార్‌గేట్ 2 మి.లీ లేదా స్పైనోసెడ్ ఒక మి.లీ. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

? టమాటలో సుడిపురుగు (పిన్‌వార్మ్) నివారణకు చర్యలు తెలపండి. **- రామకృష్ణ, మున్ననూర్**

✓ లీటరు నీటిలో ఇండాక్సాకార్బ్ 1.75 మి.లీ లేదా స్పైనోశాడ్ 0.3 మి.లీ లేదా డెల్టామెత్రిన్ 1 మి.లీ లేదా లాంబ్డా సైహలోత్రిన్ 1 మి.లీ. కలిపి పిచికారీ చేయాలి.

? కందిలో మారుక గూడుపురుగు నివారణకు ఎలాంటి మందులు వాడాలి? **- స్వామి, చెన్నారం**

✓ నివారణకు వేపమందు (1500పీపీఎం) 5 మి.లీ, న్యూవలురాన్ 1 మి.లీ లేదా క్లోరాంట్రినిలిప్రోల్ 0.3 మి.లీ లేదా ఎసిఫేట్ 1.5 గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

- డాక్టర్ రాజేందర్‌రెడ్డి, కీటక శాస్త్రవేత్త, కేవీకే మదనాపురం

- న్యూస్‌టుడే, మదనాపురం

సాగులో.. సమస్యలా?

మదనాపురం : సాగులో యాజమాన్య పద్ధతులపై అన్నదాతలు ఆదివారం మినహా మిగతా రోజుల్లో ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య చరవాణి నం : 94408 35658కు ఫోన్ చేసి సందేహాలను నివృత్తి చేస్తామని కేవీకే కీటక శాస్త్రవేత్త డాక్టర్ రాజేందర్‌రెడ్డి తెలిపారు.

వేరుసెనగలో సస్యరక్షణ పాటిస్తే దిగుబడులు

మదనాపురం, న్యూస్‌టుడే : సాగుచేసే యాసంగిలో వేరుసెనగలో కలుపు, చీడపీడల నివారణకు సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులు పాటిస్తే రైతులు అధిక దిగుబడి సాధించవచ్చని మదనాపురం కృషి విజ్ఞాన కేంద్రం కీటక శాస్త్రవేత్త డాక్టర్ రాజేందర్ రెడ్డి తెలిపారు. టీఏజీ 24, కదిరి 6, కదిరి 9, లేపాక్షి, హరిత, ధరణి, జేఎల్ 24, జగిత్యాల పల్లి 1, టీసీజీఎస్ 1694 అనువైన రకాలని పేర్కొన్నారు.



సాగు చేసిన వేరుసెనగ

విత్తనశుద్ధి : విత్తనాన్ని టెబ్యుకోనజోల్ 2డీఎస్ మందును ఒక గ్రాము లేదా మ్యాంకోజెబ్ 3 గ్రాములు కిలో విత్తనానికి కలిపి విత్తనశుద్ధి మొదట చేసుకుని ఆపైన ట్రైకోడర్మా 10 గ్రాములు, రైజోబియం 5 గ్రాములు విత్తనం వేసే 2 గంటల ముందు కలుపుకొని విత్తుకోవాలి.

పోషకాల యాజమాన్యం : భాస్వరం, పొటాష్ ఎరువులు విత్తే సమయంలోనే వేయాలి. ఎకరానికి 100 కిలోల సూపర్‌ఫాస్ఫేట్, 33 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్, 18 కిలోల యూరియాను విత్తే సమయంలో వేయాలి. పంట పూత, ఊడలు దిగే సమయంలో 200 కిలోల జిప్సం మొదళ్ల దగ్గర వేయాలి. విత్తిన 30 రోజుల తర్వాత తొలిపూత దశలో ఎకరానికి 10 లేదా 12 కిలోల యూరియా వేసుకోవాలి.

కలుపు నివారణకు..: విత్తిన వెంటనే లేదా 2 రోజుల లోపల కలుపు నివారణకు అలాక్లోర్ ఒక లీటరు లేదా పెండిమిథాలిన్ 1.3 లీటరును ఎకరానికి 200 లీటర్ల నీటికి కలిపి నేలపై పిచికారీ చేసుకోవాలి. గడ్డిజాతి మొక్కలు అధికంగా ఉంటే క్విజలోఫాప్-పి-ఇథైల్ ఎకరాకు 400 మి.లీ లేదా ప్రొపాక్విజాఫాప్-పి-ఇథైల్ ఎకరాకు 250 మి.లీ విత్తిన 20 రోజుల వరకు పిచికారీ చేసుకోవాలి.

చీడపీడల యాజమాన్యం : రసం పీల్చే పురుగు నివారణకు ప్రిఫోనిల్ 2 మి.లీ లేదా థయోమిథాక్సామ్ 0.4 గ్రాములు లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పొగాకు లద్దెపురుగు నివారణకు మొదటి దశలో 5 మి.లీ వేపమందు (ఎన్ఎస్‌కేఈ)ను క్లోరోపైరిఫాస్ 50ఈసీ 1.5 మి.లీ లేదా న్యూవులురాన్ 1 మి.లీ లేదా ఫ్లూబెండమైడ్ 0.2 మి.లీ లేదా ఎసిపేట్ 1.5 గ్రాముల మందు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

మంత్రులకు దసరా ఉత్సవాల ఆహ్వానం



మంత్రి జూపల్లి కృష్ణారావుకు ఆహ్వానం పలుకుతున్న ఈవో పురేందర్, అర్చకుడు ఆనంద్‌శర్మ

అలంపూర్,న్యూస్‌టుడే: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఈ నెల 3 నుంచి 12వ తేదీ వరకు అలంపూర్ ఆలయాల్లో ఉత్సవాలకు హాజరవ్వాలని మంత్రులకు ఆహ్వానం పలికారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో మంత్రులు రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, ఎంపీ డీకే అరుణకు ఈవో పురేందర్, ప్రధాన అర్చకుడు ఆనంద్ శర్మ ఆహ్వాన పత్రికలను అందజేశారు.

విద్యుదుత్పత్తికి 37,115 క్యూసెక్కుల నీరు

ఆత్మకూరు, న్యూస్‌టుడే : జూరాల ప్రాజెక్టు వద్ద 68 వేల క్యూసెక్కుల వరద ఉద్ధృతి కొనసాగుతున్న నేపథ్యంలో విద్యుదుత్పత్తికి 37,115 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గడిచిన 24 గంటల్లో ఎగువన ఐదు యూనిట్ల ద్వారా 4.151, దిగువన ఆరు యూనిట్ల ద్వారా 4.526 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరిగింది. ప్రస్తుత వర్షాకాలంలో ఎగువన 121.716, దిగువన 186.736 మిలియన్ యూనిట్లకు ఉత్పత్తి చేరిందని జెన్‌కో ఎస్ఈ (ఓఅండ్ఎం) సూరిబాబు తెలిపారు.

పాలమూరు క్రికెట్ జట్టు హ్యాట్రిక్

అర్ధ శతకాలు సాధించిన అభిలాష్, అబ్దుల్ రాఫె, షాదాబ్

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే : హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అండర్-19 రాష్ట్రస్థాయి వన్డే టోర్నీలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టు మెదక్‌పై గెలుపొంది హ్యాట్రిక్ సాధించింది. సోమవారం హన్మకొండలో నిర్వహించిన మూడో వన్డేలో మెదక్‌పై 90 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన ఉమ్మడి జిల్లా జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 217 పరుగులు చేసింది. ముగ్గురు అర్ధ శతకాలతో ఆకట్టుకున్నారు. అభిలాష్ 66, అబ్దుల్ రాఫె 54, షాదాబ్ అహ్మద్ 53 పరుగులు చేశారు. అనంతరం లక్ష్య ఛేదనకు బరిలోకి దిగిన మెదక్ జట్టు 32.1 ఓవర్లలో 127 పరుగులకే కుప్పకూలింది. జిల్లా జట్టు నుంచి షాదాబ్ 4, అంకిత్ రాయ్, ముఖీత్ చెరో 2 వికెట్లు తీశారు. విజయం సాధించిన పాలమూరు జట్టును ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్, శిక్షకుడు అబ్దుల్లా అభినందించారు.



విజయం సాధించిన ఉమ్మడి జిల్లా జట్టు



వనపర్తి జిల్లా కొత్తకోట మండలం పాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో 226 మంది చదువుకుంటున్నారు. వీరిలో 110 మంది విద్యార్థినులున్నారు. అందరికీ కలిపి పాఠశాల ఆవరణలో ఒక యూనిట్ మూత్రశాల మాత్రమే ఉంది. విద్యార్థినులు నిత్యం ఇలా బారులుదీరి నిరీక్షిస్తూ ఇబ్బంది పడుతున్నారు. ఇలాంటి అసౌకర్యాలతో చదువుపైనా శ్రద్ధ పెట్టలేకపోతున్నారు. 116 మంది బాలురు ఆరుబయటకు వెళ్లాల్సిందే. 'మన ఊరు-మన బడి'లో మరో యూనిట్ మూత్రశాల మంజూరైనా నిర్మాణం చేపట్టలేదు. ప్రధానోపాధ్యాయుడు భాస్కర్ మాట్లాడుతూ ఇటీవల బదిలీపై వచ్చానని, సమస్య ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. **- న్యూస్‌టుడే, కొత్తకోట గ్రామీణం**

బతుకమ్మ పాఠం.. చరిత్రకు అద్దం



బతుకమ్మలతో మహిళలు

కొత్తకోట, న్యూస్‌టుడే : తెలంగాణ పేరు చెప్పగానే గుర్తుకొచ్చేది బతుకమ్మ పండగ. ఇది దేశంలో అరుదైన పూల పండగ. ఏళ్ల క్రితమే మరుగున పడిన ఈ వేడుక.. రాష్ట్రం ఆవిర్భావం అనంతరం పూర్వ వైభవం సంతరించుకుంది. తొమ్మిది రోజుల పాటు మహిళలు ఎంతో ఇష్టంగా జరుపుకొంటారు. ప్రకృతిని ఆరాధిస్తూ సంప్రదాయబద్ధంగా జరిగే ఈ పండగ విశిష్టతను విద్యార్థి దశలోనే తెలిసేలా పాఠ్య పుస్తకాల్లో వీటిని చక్కగా వివరించారు. బుధవారం నుంచి జరుపుకొనే ఈ పండగ విశేషాలపై పాఠ్యపుస్తకాల్లో ఉన్న అంశాలపై 'న్యూస్‌టుడే' కథనం..

ఇది కథ..

బతుకమ్మ గురించి ఏడో తరగతి ఉపవాచకంలో 'మన పండగలు' పాఠ్యాంశంలో చక్కగా వివరించారు. 'చోళరాజు అయిన ధర్మాంగదునికి వందమంది కుమారులు సంతానం. వారంతా యుద్ధంలో మృతి చెందుతారు. చాలా కాలం తరువాత లక్ష్మీదేవి అనుగ్రహంతో ఓ ఆడపిల్ల పుడుతుంది. ఈ పాపకు బతుకమ్మ అని పేరు పెట్టి నిండూనూరేళ్లు బతకాలని అందరూ ఆశీర్వదిస్తారు'. ఆ అమ్మాయే బతుకమ్మగా పూజలందుకుంటోంది. గ్రామీణ ప్రాంతాల్లో దొరికే గునుగు చామంతి, తోక చామంతి. తంగేడు, కట్ల, పిట్టకాలి, ఎర్రగన్నేరు, రుద్రాక్ష, బీర గుమ్మడి, ముద్దబంతి వంటి రంగురంగుల పూలు సేకరించి చక్కగా పేర్చి పైన పసుపు ముద్దను నిలిపి గౌరీదేవిగా కొలుస్తారు. ప్రతి రోజూ సాయంత్రం ఆడుకొని చెరువులో నిమజ్జనం చేస్తారు.

రోజుకో తీరు..

తొమ్మిది రోజులు తొమ్మిది పేర్లతో బతుకమ్మను పిలిచి కొలుస్తారు. తొమ్మిది రకాల ఫలాలు సమర్పిస్తారు. ప్రతి రోజు ప్రత్యేకంగా ఫలహారం నైవేద్యంగా పెడతారు. తొలిరోజు ఎంగిలిపూల బతుకమ్మ, రెండో రోజు అటుకుల, మూడో రోజు ముద్దపప్పు, నాలుగో రోజు నానబియ్యం, ఐదో రోజు అట్ల బతుకమ్మను కొలుస్తారు. ఆరో రోజును అర్రెమి అంటారు. ఎవరి ఇళ్ల వద్ద వారే ఆటలాడుకుంటారు. ఏడో రోజు వేపకాయల బతుకమ్మ, ఎనిమిదో రోజు వెన్నముద్దల బతుకమ్మగా పిలుస్తారు.

సద్దుల బతుకమ్మ ప్రత్యేకం

తొమ్మిదో రోజు దసరాకు ఒకటి, రెండు రోజుల ముందు సద్దుల బతుకమ్మను జరుపుకొంటారు. ఆరోజు కుటుంబ సభ్యులంతా ఇంట్లో ఉంటారు. బతుకమ్మను పెద్దగా పేర్చుకుంటారు. కొత్త దుస్తులు ధరిస్తారు. ఆడబిడ్డలను, బంధువులను పిలుచుకుంటారు. బతుకమ్మను ఎత్తుకొని సద్దులు తీసుకుని ఆడుకున్న తరువాత చెరువుకు వెళ్తారు. జొన్న, మక్క పిండి, బెల్లం, పెసరపిండి, నెయ్యితో చేసిన పదార్థాలు, సత్తుపిండి, దోసకాయ, పెసరపప్పు, బెల్లంతో సద్దులు తయారు చేస్తారు. చెరువు వద్ద బతుకమ్మలను దించి మరోసారి ఆడుకుని చెరువులోకి సాగనంపుతారు. అనంతరం తెచ్చిన సద్దులను ఒకరినొకరు పంచుకుంటారు.

ఆట, పాటల్లో సాహిత్యం

'**బ**తుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో..' అంటూ అమ్మలక్కలు, ఆడపడుచులు ఎంతో ఇష్టంగా ఆటపాటలు లయబద్ధంగా ఆడి పాడుతుంటారు. ప్రతి పాటలోనూ గౌరమ్మనే ఆరాధిస్తారు. ఇందులో గొప్ప సాహిత్యం ఉంటుంది. ఎక్కువగా ఆడపిల్లల జీవితాలు, కష్టాలు, అత్తవారింట్లో ఎదుర్కొనే సమస్యలు పాటల రూపంలో బయటకు వస్తుంటాయి.

సంస్కృతి చాటి చెప్పేలా..

పాఠ్యపుస్తకాల్లో సంస్కృతి, సంప్రదాయాలు తెలిసేలా పాఠ్యాంశాలు ఎంతో అవసరం. వీటి వల్ల పాఠశాల దశలోనే విద్యార్థికి మన చరిత్ర తెలుస్తుంది. పండగ అంటే ఏదో కుటుంబ సభ్యులంతా కలిసి మంచి భోజనం చేయడం కాదని అందులో విశేషం ఉందని గ్రహిస్తారు. ఇలాంటి పాఠ్యాంశాలు నేటి తరానికి ఎంతో అవసరం.

- కోట్ల వనజాత, రచయిత్రి, మహబూబ్‌నగర్

అవయవదానంతో పలువురి జీవితాల్లో వెలుగు



చెన్నప్పోళ్ల జయమ్మ

మక్తల్ గ్రామీణం, న్యూస్‌టుడే : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఓ మహిళ గత వారం రోజులుగా మృత్యువుతో పోరాడి తుది శ్వాస విడిచే సమయంలో అవయవదానం చేసి పలువురి జీవితాల్లో వెలుగులు నింపింది. మక్తల్ శివాజీనగర్‌కు చెందిన చాకలి జయమ్మ గత మంగళవారం మాగనూరు మండలంలోని నల్లగట్టు మారెమ్మ ఆలయంలో మొక్కులు తీర్చుకునేందుకు ఆర్టీసీ బస్సులో వెళ్లింది. ఆలయం వద్ద బస్సు దిగే క్రమంలో ప్రమాదవశాత్తు జారిపడటంతో తలకు తీవ్ర గాయమయ్యింది. వెంటనే మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్సలు చేశారు. అక్కడి నుంచి హైదరాబాద్ ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. బ్రెయిన్ డెడ్ అయ్యిందని అక్కడి వైద్యులు చెప్పారు. స్వచ్ఛంద సంస్థ సభ్యులు జయమ్మ భర్త లక్ష్మణ్, కుటుంబ సభ్యులకు అవయవదానంపై అవగాహన కల్పించారు. దీంతో వారు అంగీకరించారు. సరోజిని కంట ఆస్పత్రికి ఒకరికి కళ్లు అమర్చగా, పదోతరగతి విద్యార్థికి కిడ్నీ అమర్చారు. ఇతర అవయవాలు మరికొందరికి అమర్చుతామని ఆస్పత్రి వైద్యులు చెప్పారు. జయమ్మ మృతదేహాన్ని సోమవారం మక్తల్ తీసుకొచ్చారు. పట్టణ ప్రజలు కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తూ ఇంటి వరకు ఊరేగింపుగా మృతదేహంతోపాటు వెళ్లారు.

చోరీ కేసుల్లో నిందితులకు రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఆదిరెడ్డి, ఎస్సై శివానందం, ముసుగులో నిందితులు

జడ్చర్ల, న్యూస్‌టుడే : కొన్ని రోజులుగా జడ్చర్ల పట్టణంలోని పలు ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను జడ్చర్ల పోలీసులు సోమవారం పట్టుకుని రిమాండుకు తరలించారు. సీఐ ఆదిరెడ్డి, ఎస్సై శివానంద్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. జడ్చర్ల పట్టణంలోని ఎర్రగుట్ట వద్ద నివాసముండే చిట్యాల రవి, వేంకటేశ్వర కాలనీలో ఉండే లింగాల మహేశ్ కలిసి తాళం వేసిన ఇళ్లను గుర్తిస్తూ వాటిలో చోరీలకు పాల్పడుతున్నారు. వీరు జులై 30న పట్టణంలోని భవానీనగర్‌లోని వడ్ల గోపి, ఆగస్టు 19న మమతనగర్ సమీపంలో నరేంద్రసాగర్, గత నెల 14న తాలుకా క్లబ్ రోడ్డులోని హసల్ అలీలకు చెందిన ఇళ్లల్లో చోరీలకు పాల్పడ్డారు. తాలుకా క్లబ్ రోడ్డులోని సీసీ కెమెరాల పుటేజీలో నిందితులు ఉన్నాయి. వారిని పట్టుకుని విచారించగా చోరీలు చేశామని ఒప్పుకొన్నారు. వారి నుంచి మూడు తులాల బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు. నగదు మాత్రం లభించలేదు. ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. నిందితులను పట్టుకోవడంలో చొరవ చూపిన పోలీసు సిబ్బంది నర్సింహ, విష్ణులను ఈ సందర్భంగా సీఐ అభినందించారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	110-00
రిటైల్	132-00
డ్రెస్డ్	191-00
స్కిన్‌లెస్	218-00

తెరపై ఈనాడు

శ్రీనివాస - దేవర, బాలాజీ - దేవర, తిరుమల - దేవర
వెంకటేశ్వర- దేవర, వెంకటాద్రి- దేవర, శ్రీకృష్ణ - మత్తు
వదలరా 2 --న్యూస్‌టుడే, మహబూబ్‌నగర్ పట్టణం

నేడు వయోవృద్ధుల దినోత్సవం

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే : అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం కలెక్టరేట్‌లో ఉదయం 11 గంటలకు జిల్లా కలెక్టర్ విజయేంది ర బోయి అధ్యక్షతన వయోవృద్ధుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు జిల్లా సంక్షేమాధికారి జరీనా బేగం సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని వయోవృద్ధులు అధిక సంఖ్యలో హాజరుకావాలని సూచించారు.

నగల కొనుగోళ్లపై రాయితీలు



షోరూంలో వినియోగదారుల సందడి

మహబూబ్‌నగర్ సాంస్కృతికం : మహబూబ్‌నగర్ తూర్పుకమాన్ సమీపంలోని జ్యువెల్ సిటీ బంగారు ఆభరణాల దుకాణం 14వ వార్షికోత్సవాన్ని యజమానులు, సిబ్బంది, వినియోగదారులతో కలిసి సోమవారం ఘనంగా నిర్వహించారు. బంగారం, వెండి ఆభరణాల కొనుగోలుపై ప్రత్యేకంగా రాయితీలు, బహుమతులు ఇవ్వటంతో షోరూంలో కొనుగోలు దారుల సందడి నెలకొంది. నాణ్యత, నమ్మకాన్ని నెలబెట్టుకోవటం వల్లే వినియోగదారులు ఆదరాభిమానాలు పొందుతున్నట్లు షోరూం యజమానులు రమేశ్, లలిత తెలిపారు.

ఉమ్మడి జిల్లా రెజ్లింగ్ జట్ల ఎంపిక

ధన్వాడ, న్యూస్‌టుడే : ఉమ్మడి జిల్లా రెజ్లింగ్ జట్ల ఎంపికల్ని ఎస్‌జీఎఫ్ అధికారులు పూర్తి చేశారు. 14 ఏళ్లలోపు బాలికల విభాగంలో 30 నుంచి 62 కిలోల బరువు పరిధిలో నందిని, నిఖిత, సీతామహాలక్ష్మి, శిరీష, ప్రియమణి, మౌనిక, గంగమ్మ, కీర్తి ఎంపికయ్యారు. 17 ఏళ్ల విభాగంలో నేహశ్రీ, శిరీష, జె.శిరీష, బాలమణి, జగదీశ్వరి, శివరంజని, సహేరా, సోనమ్మలు ఉన్నారు. 19 ఏళ్ల విభాగానికి సంబంధించి 50 నుంచి 53 కిలోల బరువు పరిధిలో గీత, రజిత, గీత, సాయి వైష్ణవి ఎంపికయ్యారు. బాలుర 14 ఏళ్ల విభాగంలో 35 నుంచి 68 కిలోల పరిధిలో అఖిల్, రాకేశ్, కుమార్, ప్రవీణ్, నరేందర్, జగన్ నాయక్, రోషన్, అరవింద్ వెంకటేశ్ ఎంపిక కాగా 17 ఏళ్ల విభాగంలో భాను, రాజేశ్, నందు, ఉదయ్, మహేశ్, ప్రవీణ్‌నాయక్, గిరి ఎంపికయ్యారు. 19 ఏళ్ల విభాగంలో జె.అరుణ్, చరణ్‌నాయక్, పవన్, ముకుందు ఎంపికయ్యారు.

స్కేటింగ్ పోటీలో కస్తూర్బా బాలికల సత్తా

నవాబ్‌పేట,న్యూస్‌టుడే : ఈనెల 28, 29తేదీల్లో కరీంనగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీల్లో మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాల విద్యార్థినులు పాల్గొని సత్తాచాటారు. జూనియర్, సబ్‌జూనియర్ విభాగాల్లో 3వ స్థానంలో విజేతలుగా నిలిచారు. విజేతలను, పీఈటీ అర్చనను పాఠశాల ప్రిన్సిపల్ మాధవి, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేత

జడ్చర్ల, న్యూస్‌టుడే : యూత్ ఫర్ సేవ సంస్థ ఆధ్వర్యంలో జడ్చర్లలోని సిగ్నల్‌గడ్డ జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ ఎంపిక పరీక్ష పుస్తకాలను పంపిణీ చేశారు. ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు సయ్యద్ ఇబ్రహీం, యూత్ ఫర్ సేవ నియోజకవర్గ సమన్వయకర్త రామచందర్, సభ్యులు జయకృష్ణ, పాఠశాల సిబ్బంది గోపాల్, సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ గ్రామీణం : మణికొండ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గూంజ్ అనే స్వచ్ఛంద సంస్థ సంచులు, రాత పుస్తకాలు, జత దుస్తులు, ఆటవస్తువులు పంపిణీ చేశారు. పేద విద్యార్థుల భవిష్యత్తు కోసమే ఉచిత బట్టలు సాయం అందిస్తున్నామని గూంజ్ సంస్థ సమన్వయకర్తలు వరదాస్, జయమ్మ పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయుడు చంద్రపాల్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షురాలు వీరమణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

మిడ్జిల్, న్యూస్‌టుడే : వెలుగొముల గ్రామానికి రాజదాని నుంచి బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామస్థులు మహేశ్వరం డిపో అధికారులకు వినతిపత్రం అందజేశారు. సోమవారం గ్రామానికి చెందిన పలువురు అధికారులను కలిసి రాణిపేట గ్రామానికి వస్తున్న బస్సును తమ గ్రామానికి పంపాలని కోరారు. గ్రామస్థులు బాబా, శ్రీధర్, వెంకటేశ్, సాయన్న, వీరాజ్, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉత్సాహంగా వాలీబాల్ జట్ల ఎంపికలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంఈవో శ్రీనివాస్

మహబూబ్‌నగర్ క్రీడలు: పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) మహబూబ్‌నగర్ అర్బన్ వాలీబాల్ అండర్-14, 17 బాల, బాలికల జట్ల ఎంపిక పోటీలు ఉత్సాహంగా కొనసాగాయి. సోమవారం డీఎస్ఏ మైదానంలో విద్యాశాఖ ఎంఈవో ఎ.శ్రీనివాస్ ఈ ఎంపికలను ప్రారంభించారు. పట్టణంలోని వివిధ పాఠశాలల నుంచి సుమారు 250 మంది బాలబాలికలు పాల్గొన్నారు. టోర్నీ కార్యనిర్వాహక కార్యదర్శి విలియమ్, వ్యాయామ ఉపాధ్యాయులు రవీందర్‌రెడ్డి, సాదత్‌ఖాన్, పరశురాం, ఉమాదేవి, జ్యోతి, ముస్తఫా, ఆయూబ్ ఖాన్, పుష్ప, వాలీబాల్ శిక్షకుడు పర్వేజ్ పాల్గొన్నారు.

బస్సులోనే ఆగిన గుండె



ఆంజనేయులు

జడ్చర్ల, హన్వాడ, న్యూస్‌టుడే : అనారోగ్యంతో బాధపడుతున్న భార్యను చూసేందుకు వస్తూ ఆర్టీసీ బస్సులోనే ఒకరు గుండెపోటుతో మృతిచెందిన ఘటన సోమవారం జడ్చర్ల సమీపంలో చోటు చేసుకుంది. హన్వాడ మండలం గుడిమ ల్యాపూర్‌కు చెందిన ఆంజనేయులు(45) నిర్మాణ కార్మికుడు గుత్తేదారుగా హైదరాబాద్‌లో ఉంటున్నారు. స్వగ్రామానికి అప్పుడప్పుడు వచ్చి వెళ్లేవారు. ఇటీవల ఆయన భార్య బాలరాజమ్మ అనారోగ్యానికి గురికాగా శస్త్ర చికిత్స చేయించారు. ఆమె ఆరోగ్యం పై బెంగతో భార్యను చూసేందుకు హైదరాబాద్ నుంచి కర్నూల్ ఆర్టీసీ బస్సులో బయలుదేరారు. జడ్చర్ల సమీపంలో గుండెనొప్పి రావటంతో ఆర్టీసీ అధికారులను సంప్రదించారు. డ్రైవర్ బస్సును నేరుగా జడ్చర్ల ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యుడు డా.సూర్య అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. సమాచారం తెలుసుకున్న ఇద్దరు కుమారుల రాజేందర్, రమేశ్ ఆస్పత్రికి వచ్చి తండ్రి మృతదేహం వద్ద బోరున విలపించారు.

రెవెన్యూ సంబంధిత ఫిర్యాదులే అధికం

అవగాహన లేక మండల స్థాయి ప్రజావాణికి అరకొరగానే జనం రాక

ఈనాడు పరిశీలన

చిన్న సమస్యలన్నీ మండల స్థాయిలోనే పరిష్కారం కావాలని, స్థానిక అధికారులు నిర్లక్ష్యం వహించటం వల్లనే బాధితులంతా కలెక్టరేట్ ప్రజావాణికి వస్తున్నారని కలెక్టర్ విజయేందిర బోయి గత సోమవారం పేర్కొన్నారు. ఇక నుంచి మండలాల్లో పకడ్బందీగా ప్రజావాణి నిర్వహించాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో మండలాల ప్రజావాణి నిర్వహణ తీరుపై 'న్యూస్‌టుడే' పరిశీలన చేపట్టింది. చాలా చోట్ల అధికారులు సకాలంలో హాజరుకాలేదు. కొందరు గైర్హాజరయ్యారు. కార్యక్రమం సమాచారం లేక చాలా తక్కువ మందే వచ్చారు. వివరాలు ఇలా ఉన్నాయి.

జడ్చర్ల : జడ్చర్ల మండల ప్రజావాణికి అత్యధికంగా 16 ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో ఎక్కువగా భూములకు సంబంధించి రెవెన్యూ శాఖకు వచ్చిన 9 ఫిర్యాదులు వచ్చాయి. నీటిపారుదల శాఖకు ఒకటి, పురపాలిక శాఖకు 5, మండల పరిషత్‌కు ఒక ఫిర్యాదు వచ్చినట్లు ఎంపీడీవో విజయ్‌కుమార్ తెలిపారు. తహసీల్దారు బ్రహ్మంగౌడ్, పుర కమిషనర్ రాజయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ గ్రామీణం : మహబూబ్‌నగర్ మండల ప్రజావాణికి ఒకే ఒక్క ఫిర్యాదు వచ్చింది. ఇల్లు కూలిన తనకు పరిహారం అందించాలని బాధితుడు రాంచందర్ కోరారు. గ్రామీణ తహసీల్దార్ సుందర్‌రాజు, ఎంపీడీవో కరుణశ్రీ, మండల అధికారులు సకాలంలోనే వచ్చినా జనం నుంచి స్పందన రాలేదు. తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించాల్సిన ప్రజావాణిని ఆనవాయితీకి భిన్నంగా మండల పరిషత్‌లో ఏర్పాటు చేశారు. వచ్చేవారం తహసీల్దార్ కార్యాలంలోనే ఏర్పాటు చేయాలని కలెక్టరేట్ నుంచి ఆదేశించారు.

బాలానగర్ : బాలానగర్‌లో ప్రజావాణికి ఉదయం 10.36 గంటలకు కింది స్థాయి సిబ్బందిని పంపించిన అధికారులు 11.30



రాజాపూర్ : ఉదయం 11.00 గంటలకు అధికారులంతా రాక ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

రాజాపూర్ : రాజాపూర్‌లో ప్రజావాణికి విద్యుత్తు శాఖ సంబంధించి 2, రెవెన్యూ శాఖకు 3, పంచాయతీరాజ్ శాఖకు 1 చొప్పున ఆరు ఫిర్యాదులు వచ్చినట్లు ఎంపీడీవో మచ్చేందర్, తహసీల్దార్ విద్యాసాగర్ రెడ్డి తెలిపారు. 10.30 నిమిషాలకు ప్రారంభం కాగా.. కొందరు అధికారులు 11.00 గంటల తర్వాత వచ్చారు. ఆరోగ్య, మిషన్ భగీరథ అధికారులు గైర్హాజరయ్యారు. కొందరు పంచాయతీ కార్యదర్శులు, నీటిపారుదల శాఖ అధికారి శివుడు మధ్యలోనే వెళ్లిపోయారు. పశువైద్యాధికారి కార్తిక్ మధ్యాహ్నం 1.25 గంటలకు హాజరయ్యారు.



నవాబ్‌పేట ప్రజావాణిలో మధ్యాహ్నం 2 గంటలకు మిగిలిన అధికారులు

నవాబ్‌పేట : నవాబ్‌పేటలో ఉదయం 11 గంటలకు ప్రజావాణి ప్రారంభమైంది. రాయితీ గ్యాస్ కనెక్షన్ల కోసం 3, పట్టాదారు పాసుపుస్తకం ఆన్‌లైన్ చేయాలని 1, ఎన్మనగండ్లలో నకిలీ ఓటర్లను తొలగించాలని 1, ఉచిత విద్యుత్తు కోసం 1 చొప్పున వినతులు వచ్చినట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు.

గంటలకు వారు వచ్చారు. భూ సమస్యలపై రెండు ఫిర్యాదులు వచ్చాయి. ఇన్‌ఛార్జి ఎంపీడీవో విజయకుమారి అనారోగ్యంతో మధ్యలో వెళ్లిపోయారు.

కోయిలకొండ : ప్రజావాణికి భూ, విద్యుత్తు, రుణమాఫీ సమస్యలపై 8 ఫిర్యాదులు వచ్చినట్లు తహసీల్దార్ రాజాగణేశ్ తెలిపారు. ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు పరిష్కరిస్తారని పేర్కొన్నారు.

హన్వాడ : హన్వాడ ప్రజావాణికి మూడు అర్జీలు వచ్చాయి. హన్వాడ, వేపూర్ గ్రామాల నుంచి భూ సమస్యలపై రెండు ఫిర్యాదులు, టంకరలో పాఠశాలకు తగినంతా మంది ఉపాధ్యాయులను నియమించాలని ఒక వినతి పత్రం వచ్చాయి. పెద్దదర్పల్లికి చెందిన ఓ మహిళ పింఛను అందటం లేదని మౌఖికంగా ఫిర్యాదు చేశారు.

గండీడ్ : గండీడ్ ప్రజావాణికి 4 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ నాగలక్ష్మి, ఎంపీవో నరేందర్‌రెడ్డి తెలిపారు. భూమి సర్వే, చెరువు సర్వే, అన్నదమ్ముల భూమి పంచాయతీపై రెవెన్యూ శాఖకు మూడు ఫిర్యాదులు అందాయి. రోడ్డుపై డ్రైనేజీ నిర్మిస్తున్నారని మరో ఫిర్యాదు వచ్చింది. మైనింగ్, ఆర్టీసీ, అటవీశాఖ, మిషన్ భగీరథ, మత్స్య శాఖల అధికారులు హాజరు కాలేదు.

మహమ్మదాబాద్ : మండల స్థాయి ప్రజావాణి నిర్వహిస్తారని తెలియక మహమ్మదాబాద్‌కు పెద్ద జనం రాలేదు. అధికారులు 11:15 గంటలకు కార్యక్రమం ప్రారంభించారు. మండలకేంద్రంలో రైతులు, వ్యాపారులు రహదారిపైనే కూరగాయలు అమ్ముతున్నారని యువకులు ఫిర్యాదు చేశారు. అంబులెన్సులు వెళ్లటం కూడా కష్టంగా మారిందన్నారు.

దేవరకద్ర గ్రామీణం : దేవరకద్ర ప్రజావాణికి నాలుగు ఫిర్యాదులు వచ్చినట్లు తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీవో శ్రీనివాస్‌రావు తెలిపారు. గూరకొండలో స్తంభాలకు ఆన్ ఆఫ్ బటన్లు ఏర్పాటు చేయాలని పలువురు కోరారు. వివిధ సమస్యలపై పెద్దరాజమూర్ వాసులు మూడు ఫిర్యాదులు ఇచ్చారు.

మిడ్జిల్ : మిడ్జిల్ ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరుకాలేదు. భూ, వ్యక్తిగత, గ్రామ సమస్యలపై 9 ఫిర్యాదులు వచ్చాయి.

పీయూ ఆచార్యుడికి ప్రతిష్ఠాత్మక పురస్కారం



భువనేశ్వర్‌లో జరిగిన కార్యక్రమంలో పురస్కారం అందుకుంటున్న డా.ప్రభాకర్‌రెడ్డి

పాలమూరు, న్యూస్‌టుడే : పాలమూరు విశ్వవిద్యాలయం(పీయూ) ఫార్మసీ విభాగంలో ఆచార్యుడిగా పనిచేస్తున్న డా.ప్రభాకర్‌రెడ్డి ప్రతిష్ఠాత్మక ఫార్మసీ టీచర్స్ ఆఫ్ ఇండియా పురస్కారాన్ని అందుకున్నారు. దేశ వ్యాప్తంగా 10 మంది అధ్యాపకులను ఎంపిక చేయగా అందులో పీయూ ఆచార్యుడు ఉండటం విశేషం. ఆదివారం ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లోని ఉత్కల్ విశ్వ విద్యాలయంలో ఆయనకు పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఫార్మసీ విభాగానికి పీసీఐ గుర్తింపు రావడంలో కీలకపాత్ర పోషించారు. పరిశోధనలు చేశారు. ప్రస్తుతం విభాగాధిపతిగా, సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ ఫార్మసీలో సభ్యులుగా కొనసాగుతున్నారు. సోమవారం పీయూ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయనను ప్రిన్సిపల్ డా.నూర్జహాన్, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డా.ప్రవీణ, డా.చిన్నాదేవి, రవికాంత్, ఈశ్వర్, సోమేశ్, శైలేశ్, సురేశ్, తరుణ్, సరిత, స్వాతి, సుజాత, శారద, సుస్మిత తదితరులు సన్మానించారు.

మధ్యప్రదేశ్ ఎమ్మెల్యే సైకిల్ యాత్ర



జడ్చర్ల, న్యూస్‌టుడే : మధ్యప్రదేశ్ రాష్ట్ర శాసనసభ సభ్యుడు మొంటుసోలంకీ తన లక్ష్య సాధనకు మధ్యప్రదేశ్ రాష్ట్రం నుంచి ఆంధ్రప్రదేశ్ తిరుపతికి 14 వందల కి.మీ. దూరం చేపట్టిన సైకిల్‌యాత్ర సోమవారం జడ్చర్ల మీదుగా కొనసాగింది. ఆయన వెంట భద్రత సిబ్బంది, కార్యకర్తలు ఉన్నారు.

ఎరుకల సామాజికవర్గ అభ్యున్నతికి కృషి

మెట్టుగడ్డ (మహబూబ్‌నగర్), న్యూస్‌టుడే : ఎరుకల సామాజికవర్గ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయనున్నట్లు తెలంగాణ అల్పసంఖ్యాక ఆర్థిక సంఘం అధ్యక్షుడు ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. ఎరుకల రిజర్వేషన్ల సాధన దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం ఆధ్వర్యంలో సోమవారం మహబూబ్‌నగర్ పట్టణం పద్మావతికాలనీలోని ఏకలవ్యుడి విగ్రహం వద్ద ఎరుకల ఆత్మగౌరవ పోరాట జెండా పండగ నిర్వహించారు. సంఘం నేత లాల్‌కోట శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఒబేదుల్లా కొత్వాల్, పుర అధ్యక్షుడు ఆనంద్‌కుమార్‌గౌడ్ హాజరై మాట్లాడారు. ఎరుకల సామాజిక వర్గంలో అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చేందుకు కృషి చేస్తామన్నారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లాల్‌కోట శ్రీనివాసులు మాట్లాడుతూ గత ప్రభుత్వం మౌలాలిగుట్టపై ఏకలవ్య కమ్యూనిటీ భవన నిర్మాణానికి 2 ఎకరాల స్థలం కేటాయించిందని, నిధులు మంజూరు కోరారు. అంతకుముందు ఎరుకల ఆత్మగౌరవ పోరాట జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు కృష్ణ, జములన్న, రాములు, జానకయ్య, లక్ష్మీ, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

రహదారులు బాగుంటేనే పట్టణాభివృద్ధి



రోడ్డు పనులను ప్రారంభించిన కార్పొరేషన్ ఛైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, పుర అధ్యక్షుడు ఆనంద్‌కుమార్‌గౌడ్ తదితరులు

పాలమూరు పురపాలకం, న్యూస్‌టుడే : రహదారులు బాగుంటేనే పట్టణాభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర అల్ప సంఖ్యాక వర్గాల ఆర్థిక సంఘం అధ్యక్షుడు ఒబేదుల్లా కొత్వాల్ పేర్కొన్నారు. 33, 34 వార్డుల పరిధి ఖలీల్‌చౌక్, కొత్తచెరువు రోడ్డు పరిసరాలను అనుసంధానం చేసే ఖలీల్‌చౌక్ ఏరియాలో రూ.30 లక్షలతో నిర్మించే సీసీరోడ్డు పనులను పుర అధ్యక్షుడు ఆనంద్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ఆయన సోమవారం ప్రారంభించారు. పురపాలక ఛైర్మన్ ఆనంద్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ పదేళ్ల భారాస పాలనలో వార్డుల్లో ఏమాత్రం పనులు జరగలేదని, ఇటీవల కౌన్సిల్ సమావేశంలో ఒక్కో వార్డుకు రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షల మేరకు నిధులు కేటాయించి రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేత ఎన్పీ వెంకటేశ్, వార్డు కౌన్సిలర్లు ఎండీ.మునీర్, కోట్ల నర్సింహ, మాజీ కౌన్సిలర్ శివశంకర్, నాయకులు, ఇళ్ల యజమానులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యం



ప్రారంభించిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ వద్ద ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, కలెక్టర్ విజయేందిర బోయి

అడ్డాకుల, న్యూస్‌టుడే : మహిళలు ఆర్థికంగా సాధికారత సాధిస్తేనే సమాజం పురోగమిస్తుందని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. మూసాపేట మండల కేంద్రంలో ఆదర్శ మహిళా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ఆయన కలెక్టర్ విజయేందిర బోయి, అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్‌తో కలిసి సోమవారం ప్రారంభించారు. అనంతరం రైతువేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అడ్డాకుల, మూసాపేట మండలాలకు చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే ధ్రువపత్రాలు అందజేశారు. నాయకులు అరవింద్‌కుమార్‌రెడ్డి, శెట్టిశేఖర్, శ్రీహరి, జగదీశ్వర్, బగ్గికృష్ణయ్య, రామన్‌గౌడ్, బాలనర్సింహులు, నాగార్జునరెడ్డి, విజయమోహన్‌రెడ్డి ఉమ్మడి మండలాల నాయకులు మహిళలు పాల్గొన్నారు.

దేవరకద్ర గ్రామీణం : రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. ముచ్చింతల గ్రామంలోని ఊకచెట్టు వాగుపై రూ.27.80 కోట్ల నిధులతో చేపట్టే చెక్‌డ్యామ్ నిర్మాణానికి భూమి పూజ చేశారు.

భూత్పూర్ : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. భూత్పూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మండలంలోని 6,300 మంది లబ్ధిదారులకు రూ.500 గ్యాస్ సిలిండర్ మంజూరు పత్రాలను అందజేశారు. అనంతరం డప్పు కళాకారులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఎంపీడీవో ప్రభాకర్, తహసీల్దార్ రహమాన్, పుర కమిషనర్ సురేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కదిరె శేఖర్ రెడ్డి నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, లిక్కి నవీన్, నర్సింహరెడ్డి, హర్యానాయక్, మాధవరెడ్డి, లిక్కి విజయ్ పాల్గొన్నారు.

మారథాన్‌లో పతకం



పతకం సాధించిన ఐజీ ఎం.రమేశ్‌రెడ్డి

అమరచింత, న్యూస్‌టుడే : జర్మనీ దేశంలోని బెర్లిన్ నగరంలో సెప్టెంబరు 29న నిర్వహించిన 5, 10 కి.మీ. మారథాన్ పోటీల్లో తెలంగాణ పోలీస్ అకాడమి నుంచి అమరచింత మండలం మస్తీపూర్ గ్రామానికి చెందిన ఐజీ ఎం.రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు. 161 దేశాల నుంచి 58,212 మంది పోటీల్లో పాల్గొన్నారు. నిర్వాహకులు 10 మందిని పతకాలకు ఎంపిక చేయగా. అందులో ఐజీ రమేశ్‌రెడ్డి ఉన్నారు.

రైతుల శ్రేయస్సుకే ప్రథమ ప్రాధాన్యం

భూత్పూర్, న్యూస్‌టుడే : రైతుల శ్రేయస్సు కోసం ప్రాథమిక సహకార సంఘాలు పనిచేస్తాయని భూత్పూర్ సంఘం అధ్యక్షుడు కదిరె అశోక్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో రైతులను ఉద్దేశించి మాట్లాడారు. సీఈవో రత్నయ్య, సంఘం డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

నవాబ్‌పేట : రైతులకు సేవలు అందించడానికి సహకార సంఘం నిరంతరం కృషి చేస్తుందని పీఏసీఎస్ అధ్యక్షుడు నర్సింహులు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో ఎన్మనగండ్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మహాజన సభకు అధ్యక్షత వహించారు. మాజీ ఛైర్మన్లు మధుసూధన్‌రెడ్డి, లింగం, మార్కెట్ మాజీ ఛైర్మన్ లక్ష్మయ్య, మాజీ మైసమ్మ దేవాలయ ఛైర్మన్లు గోపాల్, కృష్ణయ్య, ముడా డైరెక్టర్ చెన్నయ్య, మాజీ సర్పంచి గోపాల్‌గౌడ్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

బాలానగర్ : రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి ప్రాథమిక సహకార సంఘం అభివృద్ధికి సహకరించాలని పీఏసీఎస్ సంఘం అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం ప్రాథమిక సహకార సంఘం సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసి మట్లాడారు. మానిటరింగ్ అధికారి శ్రీధర్‌గౌడ్, సింగిల్ విండో డైరెక్టర్లు యాదయ్య, మంజూనాయక్, సీఈవో శ్యాంసుందర్ ఉన్నారు.

శౌచాలయ నిర్మాణ పనులు ప్రారంభం



చౌదూర్ ఉన్నత పాఠశాలలో శౌచాలయ పనులను ప్రారంభించిన అధికారులు

నవాబ్‌పేట : చౌదూర్ గ్రామ ఉన్నత పాఠశాలలో నిలిచిపోయిన శౌచాలయ నిర్మాణం పనులపై సోమవారం 'శౌచాలయం లేక అవస్థలు' ఈనాడు కథనానికి మండల అధికారులు స్పందించారు. ఎంపీడీవో జయరామ్‌నాయక్ ఆదేశాల మేరకు ఎంఈవో నాగ్యానాయక్ హుటాహుటిన చౌదూర్ ఉన్నత పాఠశాలను సందర్శించి పనులకు సంబంధించి వివరాలను తెలుసుకున్నారు. అధికారులే శౌచాలయ నిర్మాణ పనులను ప్రారంభించారు.

స్పందనకు వందనం

బాధ్యులను కఠినంగా శిక్షించాలి



కోయిలకొండ: వివేకానంద కూడలిలో నిరసన వ్యక్తం చేస్తున్న విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు

కోయిలకొండ, న్యూస్‌టుడే: తిరుపతి లడ్డూలో కల్తీనెయ్యి వాడి అపవిత్రం చేసిన బాధ్యులను కఠినంగా శిక్షించాలని మండల విశ్వహిందూ పరిషత్ మండల అధ్యక్షుడు పార్థసారథి డిమాండ్ చేశారు. సోమవారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో వివేకానంద కూడలి నుంచి ఆది ఆంజనేయస్వామి ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. లడ్డూ వివాదంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలన్నారు. అనంతరం ఎంపీడీవో కాళప్పకు వినతి పత్రం అందించారు.

గండీడ్, న్యూస్‌టుడే : తిరుపతి లడ్డూ ప్రసాదం అపవిత్రం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వీహెచ్‌పీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం గండీడ్ డిప్యూటీ తహసీల్దార్ మాధవికి వినతిపత్రం అందజేశారు. వీహెచ్‌పీ నాయకులు శ్రీను, మహిపాల్‌గౌడ్, అంజిలయ్య, నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు వైద్య పరీక్షలు



పంచాయతీ కార్మికులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి డా.అస్గర్‌అలీ. చిత్రంలో తహసీల్దార్, ఎంపీడీవో, వైద్య సిబ్బంది

మహబూబ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే : స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మహబూబ్‌నగర్ మండలంలోని పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుల కోసం మండల మహిళా సమాఖ్య భవనంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఎదిర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా.అస్గర్ అలీ, ఇతర వైద్య సిబ్బంది పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు జరిపి అవసరమైన మందులు, వైద్య సహాయం ఉచితంగా అందజేశారు. మండలంలోని 26 గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులందరూ ట్రాక్టర్లలో వచ్చి వైద్య పరీక్షలు చేయించుకొని మందులు తీసుకుని తిరిగి వెళ్లారు. కార్యక్రమంలో ఎంపీడీవో కరుణశ్రీ, తహసీల్దార్ సుందర్‌రాజు, ఎంపీవో శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాధనం వృథా చేస్తే చర్యలు

గండీడ్, న్యూస్‌టుడే : గ్రామాల్లో ఉపాధి హామీ పనుల్లో ప్రజాధనాన్ని వృథా చేయకుండా ఎప్పటికప్పుడు పరిశీలన చేసుకోవాలని అదనపు డీఆర్‌డీఏ పీడీ ముజహిదా బేగం అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు దాదాపు రూ.7.40 కోట్లకు సంబంధించిన పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. కొన్ని గ్రామాల్లో కూలీలు సంతకాలు చేయకుండానే చెల్లింపులు చేశారని మండిపడ్డారు. సామాజిక తనిఖీ బృందం సభ్యులు, అధికారులు చెబుతున్న వాటికి పొంతన లేకుండా పోయింది. దీనిపై మండల కాంగ్రెస్ నాయకులు గొడవ చేయడంతో స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఎంపీవో నరేందర్‌రెడ్డి, జిల్లా విజిలెన్స్ అధికారి ప్రేమలత, అంబుడ్స్‌పర్సన్ సంతోష్, ఏపీడీ శ్రీపాద్, ఏపీవో హరిశ్చంద్రుడు, ఏవీవో శృతి తదితరులు పాల్గొన్నారు.

పిచ్చిమొక్క తీగ తొలగింపు

మహమ్మదాబాద్ : మహమ్మదాబాద్‌లోని విద్యుత్తు ఉపకేంద్రంలో నియంత్రిక, తీగలకు పిచ్చిమొక్క పెరిగి అల్లుకుపోయిన వైనంపై 'అల్లుకున్న నిర్లక్ష్యం' శీర్షికన సోమవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి ఏఈ సత్యం స్పందించారు. పిచ్చిమొక్క తీగను తొలగించారు.

కూలిన ఇంటి గోడ

రాజాపూర్, న్యూస్‌టుడే: గత కొద్ది రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు రాజాపూర్ మండల కేంద్రంలోని ఉడిత్యాల లింగం, ఉడిత్యాల రాములమ్మకు చెందిన రేకుల ఇంటి గోడలు ఆదివారం రాత్రి కూలిపోయాయి. ప్రభుత్వం తరపున ఆర్థిక సాయం అందించి, నూతన ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేయాలని భాజపా మండల అధ్యక్షుడు రామకృష్ణ కోరారు.

బాలానగర్‌లో మోస్తారు వర్షం

బాలానగర్, న్యూస్‌టుడే: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో సోమవారం ఉరుములతో కూడిన మోస్తారు వర్షం కురిసింది. అయిదు రోజులుగా వర్షం లేకపోవడంతో ఉష్ణోగ్రత 32 డిగ్రీలకు పెరిగింది. సాయంత్రం కురిసిన వర్షానికి పలు కాలనీల్లో వరద నీరు వరదల ప్రవహించింది. రోడ్లపై వర్షపు నీరు రావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొకున్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

హన్వాడ, న్యూస్‌టుడే : హన్వాడ మండలం శేక్‌పల్లికి చెందిన బి.కృష్ణ(24) చికిత్స పొందుతూ మృతి చెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. శేక్‌పల్లికి చెందిన కృష్ణ హైదరాబాద్‌లో ఒక పార్సిల్ సర్వీస్ సంస్థలో పనిచేస్తున్నాడు. శుక్రవారం ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా నార్సింగ్ సమీపంలో అతడు ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. రెండు రోజులు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్సల తర్వాత స్వగ్రామమైన శేక్‌పల్లికి ఆదివారం రాత్రి వచ్చాడు. అదే రోజు రాత్రి మూడు గంటల ప్రాంతంలో కడుపులో నొప్పి రావటంతో కుటుంబ సభ్యులు జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్సలు అందిస్తుండగానే మృతిచెందాడు.

అదృశ్యమైన వ్యక్తి ..

బాలానగర్, న్యూస్‌టుడే: ఈనెల 27న అదృశ్యమైన వ్యక్తి గ్రామ శివారులో మృతిచెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని హేమాజీపూర్ గ్రామానికి చెందిన మంగళి ఈశ్వరయ్య(70) మతిస్థిమితం లేకపోవడంతో 27న ఇంటి నుంచి బయటకు వెళ్లారు. గ్రామ శివారులోని బావిలో పడి మృతి చెందినట్లు గుర్తించారు. భార్య బాలమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఉరేసుకుని ఆత్మహత్య



శ్రీను

గండీడ్: ఉరేసుకుని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన గండీడ్ మండలంలోని రుసుంపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్థుల వివరాల ప్రకారం.. రుసుంపల్లి గ్రామానికి చెందిన శ్రీను(22) సోమవారం పొలం దగ్గర చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని గ్రామస్థులు తెలిపారు. ఈ విషయంపై ఎలాంటి సమాచారం అందలేదని పోలీసులు తెలిపారు.

కేసు నమోదు

బాలానగర్: మండలంలోని నేరళ్లపల్లి గ్రామానికి చెందిన నర్సింహులు(40) ఆదివారం చెరువులో పడి మృతిచెందిన విషయం విదితమే. సోమవారం మృతుడి భార్య నవనీత ఎవరి మీద అనుమానాలు లేవని ఠాణాలో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వయసు 19.. చోరీలు 23

ద్విచక్రవాహనాల నిందితుడు, అతనికి సహకరించిన నలుగురి అరెస్టు

యాచారం, న్యూస్‌టుడే: జల్సాల కోసం ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడిన యువకుడు చివరకు పోలీసులకు చిక్కి కటకటాలు లెక్కిస్తున్నాడు. 19 ఏళ్ల వయసులోనే 23 బైక్‌లను చోరీ చేశాడు. యాచారం పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి ఈ కేసు వివరాలు వెల్లడించారు. ఫార్మాసిటీ పోలీసులు సెప్టెంబరు 29న మేడిపల్లిలో వాహనాల తనిఖీ చేస్తుండగా.. తలకొండపల్లి మండలం వెంకట్రావ్‌పేటకు చెందిన హర్షవర్ధన్(19) మోటర్‌సైకిల్‌పై అనుమానంగా వెళ్లడం గమనించి ప్రశ్నించారు. మోటర్‌సైకిల్‌కు పత్రాలు లేవు. దీంతో మరింతలోతుగా విచారించారు. మోటర్ సైకిళ్లను తాను దొంగిలిస్తుంటానని హర్షవర్ధన్ అంగీకరించాడు. సీఐ నర్సింహరావు, ఎస్సై తేజంరెడ్డి.. పోలీసులతో కలిసి బృందాలుగా ఏర్పడి అతను దొంగిలించిన రూ.9 లక్షలు విలువ చేసే 23 మోటర్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ చెప్పారు. నందివనపర్తి గ్రామ నివాసి రాజు(29), మహ్మద్ అమెర్ అలీ(22), మేడిపల్లి గ్రామ నివాసి భేత జంగయ్య(32), జాల నాగరాజు(24) ద్వారా గ్రామాల్లోని రైతులకు తక్కువ ధరకు వాహనాలు విక్రయించినట్లు చెప్పాడు. మహబూబ్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్, ఇబ్రహీంపట్నం, ఆదిభట్ల, మంచాల, యాచారం, మేడిపల్లి ఫార్మాసిటీ పోలీసుస్టేషన్ల పరిధిలోని బస్టాండ్లు, హోటళ్ల వద్ద పార్కు చేసిన వాటిని చోరీ చేసినట్లు చెప్పాడని డీసీపీ తెలిపారు. హర్షవర్ధన్‌తోపాటు అతనికి సహకరించిన నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. సమావేశంలో ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, సీఐ నర్సింహరావు, ఎస్సై తేజంరెడ్డి పాల్గొన్నారు.